క్లుప్తంగా

సుగాలిమెట్టలో వైద్యశిబిరం



ఆరోగ్య పరీక్షలను పరిశీలిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటరమణ

పాణ్యం: మండల పరిధిలోని సుగాలిమెట్ట గ్రామంలో విష జ్వరాలు ప్రభలి ప్రజలు మంచం పట్టారు. ఈ విషయాన్ని పత్రికల్లో ప్రచురించగా అధికారులు మంగళవారం ఉదయం గ్రామానికి చేరుకున్నారు. డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటరమణ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. అదేవిధంగా వైద్యులు ఇంటింటికీ వెళ్లి పరిక్షలు చేశారు. వ్యక్తిగతంతోపాటు పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు డాక్టర్లు సూచించారు. కాచిన నీటిని చల్లార్చుకుని తాగాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు సునీతా, అభిషేక్, ఎంపీహెచ్‌ఈఓ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాలను పెంపొందించాలి



సమావేశంలో మాట్లాడతున్న ఎంఈఓ జ్యోతి

సి.బెళగల్: ఉపాధ్యాయులు విద్యార్థుల విద్యా నైపుణ్యాలను పెంపొందించి, వారి విద్యాభివృద్ధికి కృషి చేయాలని ఎంఈఓ జ్యోతి సూచించారు. మండల కేంద్రం సి.బెళగలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న స్కూల్ కాంప్లెక్స్ సమావేశాన్ని మంగళవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ కాంప్లెక్స్ సమావేశంలో చర్చించే అంశాలు విద్యార్థుల పురోగతి దోహదపడేలా ఉండాలన్నారు. కాంప్లెక్స్ సమావేశాల్లో తెలుగు, గణితం, జీవశాస్త్ర పాఠ్యాంశాలపై రీసోర్సు పర్సన్స్ (ఆర్‌పీలు) ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు.

శాంతిరామ్ విద్యార్థి ప్రతిభ



విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం

పాణ్యం: మండల పరిధిలోని నెరవాడ మెట్ట వద్ద ఉన్న శాంతిరామ్ ఇంజినీరింగ్ కళాశాల ఈసీ విభాగానికి చెందిన సాయి వైష్ణవి ఐఈఐసీ పరీక్షలలో ద్వితీయ స్థానంలో నిలిచి ప్రతిభ చాటాడు. ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఈనెల 04న జిల్లా కేంద్రం కర్నూలులోని జి. పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలో ఐఈఐసీ పరీక్షలు నిర్వహించారన్నారు. సాయవ వైష్ణవి విత్ ఇంజినీరింగ్ సొల్యూషన్ యూసింగ్ ఏఐ అనే పత్రాన్ని సమర్పించినట్లు తెలిపారు. ఈ మేరకు మంగళవారం వైష్ణవిని ప్రిన్సిపాల్‌తోపాటు కళాశాల చైర్మన్ శాంతిరాముడు, ఎండీ శివరామ్, డీన్ అశోక్‌కుమార్, హెచ్‌ఓడీలు మల్లికార్జునరావు అభినందించారు.

మధ్యాహ్న భోజనం నాణ్యతగా వడ్డించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆదామ్‌బాషా

సి.బెళగల్: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం నాణ్యతగా వడ్డించాలని ఎంఈఓ – 2 ఆదామ్‌బాషా సూచించారు. మంగళవారం స్థానిక కస్తూర్బా విద్యాలయంలో మండలంలోని పది పాఠశాలలకు చెందిన వంట నిర్వాహకులకు శిక్షణ ఇచ్చారు. మెనూ అమలు, ఆహార పదార్థాలు, వంట పాత్రల పరిశుభ్రతపై శిక్షణ ఇచ్చారు.

హిందీ భాష సంఘటితంగా ఉంచుతుంది



సమావేశంలో మాట్లాడుతున్న లీలావతి

కల్లూరు: భారతీయులను హిందీ భాష సంఘటింగా ఉంచుతుందని ఉలిందకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లీలావతి అన్నారు. మంగళవారం పాఠశాలలో భారత ప్రభుత్వ సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో హిందీ భాషా పక్షోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాతృభాష తెలుగుతో పాటు ప్రతి ఒక్కరూ హిందీలో ప్రావీణ్యత సాధించాలన్నారు. విద్యార్థులకు హిందీ భాషకు సంబంధించి వ్యాసరచన పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో భారత ప్రభుత్వ క్షేత్ర ప్రచార సహాయకులు ఫణికుమార్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేద విద్యార్థుల ఆశలపై నీళ్లు చల్లొద్దు



పేద విద్యార్థులు దాక్టర్లు కావాలనే ఆశలపై కూటమి ప్రభుత్వం నీళ్లు చల్లడం సమంజసం కాదు. సొంత జిల్లాలోనే మెడికల్ కళాశాలు ఉన్నాయనే భరోసాతో నిరుపేద విద్యార్థులు సైతం కోచింగ్ తీసుకున్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వైద్య విద్యను ప్రైవేట్ పరం చేసేందుకు పూనుకోవడం బాధాకరం. తక్షణమే ప్రభుత్వం మెడికల్ కళాశాల ప్రయివేటీకరణ చేయాలనే ఆలోచన విరమించుకోవాలి. తల్లిందండ్రులు, మేధావులు, జిల్లా అధికారులు, ఇతర ప్రజా ప్రతినిధుల సహాలు తీసుకోని నిర్ణయం తీసుకోవాలి. – ప్రతాప్, విద్యార్థి సంఘం నాయకుడు




విద్యార్థుల జీవితాలతో ఆటలొద్దు



ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రైవేట్ పరం చేసేందుకు కుట్రలు పన్నుతోంది. పేద విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఏ మాత్రం మంచిది కాదు. గత ప్రభుత్వం పేదల కోసం మెడికల్ కళాశాలలను కట్టించింది. ఇప్పుడెందుకు ఆ కళాశాలలను ప్రైవేట్‌కు ఇచ్చేయాలని అనుకుంటున్నారో అర్థం కావడం లేదు. వైద్య కళాశాలలపై కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకుంటే బాగుంటుంది. పేద విద్యార్థుల వైద్యవిద్యకు ప్రభుత్వం చేయూతనివ్వాలి. – మహబూబ్ బాషా, మంచాలకట్ట గ్రామం, గడివేము మండలం

సమాచారం పొందడం పౌరుడి హక్కు!

- ఆర్టీఐ చట్టంపై ఇంకా అవగాహన అవసరం
- ప్రజల చైతన్యంతోనే పారదర్శక పాలన



గడివేముల: ప్రభుత్వ పాలనకు సంబంధించి ప్రతి విషయం ప్రజలు తెలుసుకునేందుకు సమాచారం హక్కు చట్టం (ఆర్టీఐ యాక్ట్) ఉంది. ప్రతి సమాచారం తెలుసుకునే హక్కు పౌరుకు ఈ చట్టం కల్పించింది. అయితే ప్రజలకు పూర్తిస్థాయిలో ఈ చట్టంపై అవగాహన లేదనే చెప్పాలి. ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ఇతరత్రా అంశాలకు సంబంధించి ఏదైనా సమాచారం తెలుసు కోవడం కోసం చాలా మంది ప్రభుత్వ కార్యాల యాలకు వెళ్లి అధికారుల చుట్టూ తిరిగి విసిగి వేసారిపోతుంటారు. ప్రతి రోజూ పనులు మానుకుని నిరీక్షిస్తూ సమయాన్ని వృథా చేసుకుంటుంటారు. అయితే తాము కోరిన సమాచారం పొందదానికి ఓ చట్టం ఉందని ఇంకా చాలా మందికి తెలియకపోవచ్చు. అందుకే ప్రశ్నించే తత్వం ప్రజలకు రాలేదనేది అనుమానం. కేవలం రూ.10తో దరఖాస్తు చేసుకుంటే గ్రామ సచివాలయం నుంచి రాష్ట్రపతి భవన్ వరకు ఎలాంటి సమాచారమైనా పొందే అవకాశం ఉంది. 2005లో సమాచార హక్కు చట్టాన్ని ప్రభుత్వం తీసుకొచ్చింది. ఈ చట్టం ద్వారా పౌరుడు అడిగిన సమాచారాన్ని కచ్చితంగా ఇవ్వాల్సిన బాధ్యత అధికారులకు ఉంది. ప్రజల చేతిలో పాశుపతాస్త్రం సమాచార హక్కు చట్టం. ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థల నుంచి సమాచారం అడిగి తెలుసుకునే అధికారాన్నిస్తుందీ చట్టం. ఈ చట్టం ద్వారా ప్రభుత్వం చేపట్టే పనుల వివరాలు, నిధుల విడుదల, వినియోగం ఇతరత్రా అంశాలను తీసుకోవచ్చుకూడా. సమాచార అధికారి వివరాలు ఉండాలి. సమాచార హక్కు చట్టం ప్రకారం ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో సహాయ పౌర సమాచార అధికారి, సమాచార అధికారి, అప్పిలేట్ అధికారుల పేర్లు, వారి ఫోన్ నంబర్లు ప్రజలకు కనిపించేవిధంగా బోర్డులు ఉంటాయి. అలా ఉంచకపోయినా అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుంది.

సమాచారం ఇలా అడగాల్సి ఉంటుంది

సమాచారం కావాల్సిన వారు సంబంధిత కార్యాలయంలో సమాచార అధికారులకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. దరఖాస్తుకు సంబంధించి తెల్ల పేపర్‌లోనైనా రాస్తే సరిపోతుంది. రాయడం తెలియకపోయినా, సమాచారం సక్రమంగా అడిగే అవగాహన లేకపోయినా పౌర సమాచార అధికారి వద్ద తగిన సాయం తీసుకోవచ్చు. కోర్టు పరిశీలనలో ఉన్న సమాచారం. కేబినెట్ సమావేశాలు, రికార్డులు, మంత్రులు, వారి కార్యదర్శుల నిర్ణయాలు, వ్యక్తిగత భద్రతకు భంగం కలిగించే సమాచారం ఇచ్చేందుకు నిరాకరించవచ్చు. అయితే అవి కూడా ప్రజాప్రయోజనాలకు సంబంధించిన వివరాలు అయితే తప్పకుండా ఇవ్వాలి ఉంటుంది.

తెల్లకార్డుదారులకు ఫీజు లేదు

తెల్ల రేషన్ కార్డు ఉన్న వారికి దరఖాస్తు రుసుం ఉండదు. గ్రామ స్థాయి సంస్థల్లో అడిగే సమాచారానికి దరఖాస్తు రుసుం లేదు. మండల స్థాయిలో అయితే రూ.5. జిల్లా స్థాయిలో అయితే రూ.10 చొప్పున రుసుం చెల్లించాల్సి ఉంది. ఈ రుసుం డీడీ, చెక్కు, పోస్టల్ ఆర్డర్, నగదు రూపంలో కూడా చెల్లించవచ్చు. అడిగిన సమాచారం మేరకు సమాచారాన్ని ముద్రణ రూపంలో ఇవ్వడానికి అయ్యే ఖర్చును దరఖాస్తుదారుడు చెల్లించాల్సి ఉంటుంది. సాధారణంగా దరఖాస్తు ఫీజుతోపాటు ముద్రణ రూపంలో సమాచారం కోరితే పేజీకి రూ.2 చొప్పున ఫొటోస్టాట్ ఖర్చులు, ఫ్లాపీకి రూ.50, సీడీకి రూ.100 చెల్లించాలి. రికార్డుల పరిశీలన విషయంలో మొదటి గంటకు ఉచితం. గంట తర్వాత ప్రతి గంటకూ రూ.5 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది.

సమాచారం పొందే అంశాలు

సమాచార హక్కు చట్టం ద్వారా అనేక అంశాలపై అధికారులను కోరే హక్కు ప్రతి పౌరుడికి ఉంది. పత్రాలు, మెమోలు, ఈ–మెయిల్, రికార్డులు, అభిప్రాయాలు, సలహాలు, పత్రికా ప్రకటనలపై సైతం అడగవచ్చు. అదేవిధంగా ఉత్తర ప్రత్యుత్తరాలు, లాగ్ బుక్స్, ఒప్పందాలు, నివేదికలు, సమూనాలు, తనిఖీ రికార్డులు మొదలైన సమాచారం తీసుకునే అవకాశం ఉంది. ఇలాంటి సమాచారాలు ఎలక్ట్రానిక్ రూపంలో కూడా ఉండవచ్చు. ఉదాహరణకు రేషన్ డీలర్లకు సంబంధించి రికార్డులు, అమ్మకాల వివరాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, గ్రామ పంచాయతీ కార్యాలయం, ఇతర ప్రభుత్వ శాఖలకు సంబంధించి వార్షిక నిధులు, వాటి వినియోగం, లబ్ధిదారుల వివరాలు తదితరాలు. అదేవిధంగా సీఎం సహాయ నిధి వివరాలు, ప్రజా ప్రతినిధుల నియోజకవర్గ అభివృద్ధి నిధులు, వినియోగం తదితర వివరాలు కోరొచ్చు. కాగితాల రూపంలోనైనా, ఆన్‌లైన్‌లో సమాచారం అయితే సీడీలు, వీడియోల రూపంలో కూడా పొందవచ్చు.

భోగేశ్వరాలయంలో రుద్రాభిషేకం

గడివేముల: మండల పరిధిలోని గడిగరేవుల గ్రామంలో వెలిసిన దుర్గా భోగేశ్వర స్వామి సన్నిధిలో భాద్రపద మాసం మంగళవారం పురస్కరించుకుని విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్యాంసుందర్ శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన పూజలు చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

అవగాహన కల్పించాలి



సామాన్యులకు సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సులు నిర్వహించాల్సిన అవసరం ఉంది. ప్రజలను చైతన్య పరిస్తే ఇంకా మెరుగైన సేవలు పొందుతారు. ప్రజలు సమా చారం కోసం కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగే సందర్భాలు అనేకం. సమాచారం కోసం, దరఖాస్తు చేసుకున్న గడువులోగా వివరాలు ఇవ్వాలి. అధికారుల కాలయాపన చేయకుండా సహకరించాలి. కార్యాలయాల వద్దకు దరఖాస్తుదారులను తిప్పుకోకూడదు. –శేషాద్రిగౌడ్,గడివేముల

గడువులోగా సమాచారం ఇవ్వాలి



సమాచార హక్కు చట్టం ప్రకారం దరఖాస్తు చేసుకున్న వ్యక్తికి నిర్ణీత గడువులోగా వివరాలు అందజేయాలి. సమాచారం అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారులు బాధ్యులుగా ఉండాల్సి వస్తుంది. దరఖాస్తుదారుడి ఫిర్యాదు మేరకు సమాచారం ఇవ్వని అధికారులపై చట్టరీత్యా చర్యలు తీసుకునే అవకాశం ఉంది. సమాచారం హక్కు చట్టంపై ఇంకా పూర్తిస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. – వీఎం శ్రీరాములు, సీనియర్ న్యాయవాది, నంద్యాల

వైభవంగా విశ్వకర్మ జయంత్యుత్సవం



విశ్వకర్మ చిత్రపటాన్ని ఊరేగింపుగా తీసుకొస్తున్న విశ్వబ్రాహ్మణులు

కోడుమూరు రూరల్: శ్రీమద్విరాట్ విశ్వకర్మ జయంతి మహోత్సవ కార్యక్రమాన్ని కోడుమూరులో విశ్వబ్రాహ్మణులు మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం శ్రీకాళికాదేవి ఆలయంలో గణపతి పూజ, పుణ్యాహవాచనం, శ్రీవిశ్వకర్మ పతాకావిష్కరణ, విశ్వకర్మ పూజ, పంచశక్తి సమేత పంచ బ్రహ్మల పూజ, మంగళహారతి కార్యక్రమాలను వేద పండితులు నిర్వహించారు. అంతకుముందు ఆలయ కమిటీ చైర్మన్ వీరశేఖర ఆచారి ఇంటి వద్ద నుంచి విశ్వకర్మ చిత్రపటం, కలశాన్ని విశ్వబ్రాహ్మణులు ఊరేగింపుగా శ్రీకాళికాదేవి ఆలయానికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు లక్ష్మయ్య ఆచారి, ఉపాధ్యక్షుడు గుజురి వెంకటస్వామి, సభ్యులు నాగరాజు, మహేష్, నరేష్, జయరాం, రామక్రిష్ణ, నాగేంద్ర ఆచారి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటల సాగుకు ప్రోత్సాహం



చిన్నటేకూరు గూలాబీ తోటను పరిశీలిస్తున్న డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి

కల్లూరు: ఉద్యాన పంటలను సాగు చేస్తున్న రైతులకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సకాలను అందిస్తామని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ అమర్నాథ్‌రెడ్డి తెలిపారు. మంగళవారం కల్లూరు మండలం చిన్నటేకూరు గ్రామంలో ఫ్లోరికల్చర్‌లో భాగంగా నాటిన మల్లే, గూలాబీ తోటలను ఆయన పరిశీలించారు. ఆయా తోటల రైతులతో మాట్లాడి తోటల దిగుబడులను అడిగి తెలుసుకున్నారు. జాతీయ ఉపాధి హామీ పథకం కింద ఉద్యాన పంటల సాగుకు అర్హులైన రైతులకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. అలాగే జగన్నాథ గట్టు దగ్గర అమ్మ పేరుతో మొక్కలు నాటారు. మొక్కలు నాటితే పర్యావరణం పచ్చగా ఉంటుందన్నారు.

నులిపురుగుల నివారణతో పిల్లలకు ఆరోగ్యం



నులిపురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ, సర్పంచ్



విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి


కోడుమూరు రూరల్: పిల్లలో నులిపురుగులను నివారించడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని సర్పంచ్ భాగ్యరత్న అన్నారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా మంగళవారం కోడుమూరు బాలికల హైస్కూల్లో విద్యార్థినులకు వైద్య సిబ్బంది ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఎంపీడీఓ చంద్రశేఖర్, సర్పంచ్ భాగ్యరత్న, ఎంఈఓ వసంతలక్ష్మి విద్యార్థినులకు మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఈఓ అజయ్ భాస్కర్, హెచ్‌ఎం నాగరాజకుమారి, ఎంఆర్‌పీఎస్ జిల్లా నాయకులు ఆంధ్రయ్య, శానిటరీ ఇన్స్‌పెక్టర్ వెంకటేశ్వర్లు, హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆల్బెండజోల్ మాత్రలు వేయాలి

కల్లూరు: నులి పురుగులను నివారించాలంటే విద్యార్థులందరికీ అల్బెండజోల్ మాత్రలు వేయాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా కె.మార్కాపురం పాఠశాలలో విద్యార్థులకు అబ్బెండజోల్ మాత్రలు వేశారు. ఎంపీడీఓ మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే చదువులో చురుకుగా ఉంటారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గణ మద్దిలేటి, పంచాయతీ కార్యదర్శి శ్రవణ్ కుమార్, కల్లూరు పీహెచ్‌సీ సిబ్బంది, ఉపాధ్యాయులు, ఏఎన్‌ఎమ్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధికి... రూ. వంద ఇవ్వాల్సిందే!

- వరద బాధితులను ఆదుకోవాల్సిందే
- పొదుపు మహిళలకు హుకుం



పొదుపు లీడర్‌కు ఫోన్‌పే ద్వారా రూ.100 పంపిన రశీదు

కర్నూలు (రూరల్) : విజయవాడ వరద బాధితుల సహాయార్థం సీఎం రిలీఫ్ ఫండ్‌కు కచ్చితంగా రూ. వంద విరాళంగా ఇవ్వాలంటూ పొదుపు లీడర్లు, బుక్‌కీపర్ల హుకుం జారీ చేస్తున్నారు. దీంతో పొదుపు మహిళలకు ఆందోళన చెందుతున్నారు. మండల పరిధిలోని పంచలింగాల గ్రామం పొదపు మహిళలపై ఒత్తిడి చేయడంతో గత్యంతరం లేక రూ. 100 ఫోన్‌పే చెల్లించాల్సి వచ్చింది. తాము పొలం పనులు చేసుకుంటున్నామని పొదుపు మహిళలు చెప్పినా బుక్‌కీపర్లు అదేం కుదరదు... ఇప్పుడే రూ. 100 ఫోన్‌పే చేయండంటూ ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. ఇష్టపూర్వకంగా ఇవ్వాల్సిన విరాళాన్ని ఇలా బలవంతంగా వసూళ్లు చేయడం ఏంటని ప్రశ్నిస్తున్నారు పొదుపు మహిళలు. అయితే ఈ విషయాన్ని ఏపీఎం మల్లికార్జునస్వామి దృష్టికి తీసుకెళ్లగా మరోవిధంగా స్పందించారు. రూ.100 వసూలు చేయాలని మేము బుక్ కీపర్లకు చెప్పలేదు. కేవలం ప్రతి సభ్యురాలి నుంచి రూ.30 వసూలు చేయాలని మాత్రమే చెప్పాం. బుక్ కీపర్లు రూ.100 వసూలు చేసిఉంటే వారిపై చర్యలు తీసుకుంటాం. రూ.30 వసూలు చేసి విజయవాడ వరద బాధితుల సహాయార్థం సీఎం సహాయ నిధికి పంపాలని సర్క్యులర్ ప్రభుత్వం నుంచి మాకు అందింది. ఈ మేరకు వసూళ్లు చేస్తున్నామని తెలిపారు.

ప్రతిఒక్కరూ పరిసరాల శుభ్రత పాటించాలి



ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఎల్‌డీఓ బాలకృష్ణారెడ్డి



పరిసరాలు శుభ్రం చేస్తున్న డీపీఓ, ప్రజాప్రతినిధులు

- డీపీఓ మంజువాణి

పాణ్యం: ప్రతిఒక్కరూ పరిసరాల శుభ్రత పాటించాలని, స్వచ్ఛతాహి సేవా–2024 కార్యక్రమంతో గ్రామాలు శుభ్రంగా మారుతాయని డీపీఓ మంజువాణి పేర్కొన్నారు. పాణ్యంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం స్వచ్ఛతాహి సేవ కార్యక్రమాన్ని ఎంపీపీ ఉసేన్‌బీ, సర్పంచ్ మేకల పల్లవి, ఉప సర్పంచ్ పాలం చంద్రశేఖర్‌రెడ్డి, ఈఓఆర్డీ సులోచన, ఎంఈఓ–2సుబ్రహ్మణ్యం , ఏపీఓ విజయరాని, ఈఓ ఆనందరావుతో కలిసి డీపీఓ ప్రారంభించారు. ఈ సందర్భంగా డీపీఓ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి గ్రామంలో వచ్చే నెల 02వ తేదీ వరకు స్వచ్ఛతాహి సేవ–2024పక్షోత్సవాలు జరుగుతాయన్నారు. పారిశుద్ధ్య కార్మికులతో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు భాగస్వామ్యంతో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి రోజు గ్రామాన్ని శుభ్రంగా ఉంచడంపై ప్రణాళికలు రూపొందించామన్నారు. అనంతరం పాఠశాల మైదానంలో మావనహారం నిర్వహించారు. ప్రజలకు స్వచ్ఛతపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. అందరూ చీపుర్లుపట్టి పరిసరాలను శుభ్రం చేశారు.

కల్లూరు: పరిసరాల శుభ్రత అందరి బాధ్యతని, స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని డీఎల్‌డీఓ బాలకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం కల్లూరు మండలం ఉలిందకొండ గ్రామంలో నిర్వహించిన స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పాతబస్టాండ్, సుంకులమ్మ గుడి సెంటర్, కొత్త బస్టాండ్, వీధులలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. మానవహారంగా ఏర్పడి స్వచ్ఛతయే సేవ ప్రతిజ్ఞ చేయించారు. డీఎల్‌డీఓ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగతంతోపాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి, ఏపీఓ మద్దేశ్వరమ్మ, పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కోడుమూరు రూరల్: పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యతని కోడుమూరు ఎంపీడీఓ చంద్రశేఖర్ సూచించారు. మంగళవారం 'స్వచ్ఛతా హిసేవ' కార్యక్రమంలో భాగంగా పట్టణంలో అధికారులు ర్యాలీ నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యం జీవించవచ్చునన్నారు. అనంతరం సిబ్బంది, అధికారులు విద్యార్థులతో కలిసి మానవహారంగా ఏర్పడి స్వచ్ఛతా హిసేవ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఏపీఎం పుష్పావతి, ఈఓ అజయ్‌భాస్కర్, ఎంపీహెచ్‌ఓ నరసప్ప, వెలుగు సిబ్బంది, మండల సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

గూడూరులో....

మండల కేంద్రంలో గూడూరులో స్వచ్ఛతా హిసేవ కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ర్యాలీని మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని చెప్పారు. మున్సిపల్ ఇన్‌చార్జ్ కమిషనర్ రవికుమార్ మాట్లాడుతూ అక్టోబరు 2వతేదీ వరకు స్వచ్ఛతా హిసేవ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు.

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్ బస్టాండ్ ఆవరణలో మంగళవారం ఈఓఆర్డీ సందీప్ ఆధ్వర్యంలో స్వచ్ఛతాహీ హి సేవా కార్యక్రమం నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయం నుంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల, సి.బెళగల్ సర్పంచ్ పాండురంగన్న, స్థానిక నాయకులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ ఆవరణలో మానవహారం నిర్వహించారు. ఈఓఆర్డీ పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం అధికారులు, ప్రజా ప్రతినిధులు బస్టాండ్ ఆవరణను శుభ్రం చేశారు. చెత్తను ట్రాక్టర్‌లో తరలించారు. అదేవిధంగా సచివాలయం – 1లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో పారిశుద్ధ్య కూలీలు నాగరాజు, రంగమ్మ, ఉరుకుందమ్మ, రోగెన్న తదితరులకు వైద్య పరీక్షలను నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగరాజు, స్థానికులు చిన్న తిమ్మప్ప, ధనుంజయ, భీమన్న, బుడ్డన్న తదితరులు పాల్గొన్నారు.



స్వచ్ఛతాహీ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు



ఓర్వకల్లులో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

గడివేముల: గడివేముల మండలంలో అన్ని గ్రామ పంచాయతీలలో స్వచ్ఛతా హి కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం గ్రామాలలో పారిశుద్ధ్యం మెరుగుపరచడం, పారిశుద్ధ్య కార్మికులకు ఆరోగ్య సేవలు అందించడంతో ఆరోగ్య బీమాల గురించి అవగాహన కల్పించడం అన్నారు. అదేవిధంగా పారిశ్యుం, ప్లాస్టిక్ ప్రమాదంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో మనోహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు.

ఓర్వకల్లు: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఈఓఆర్డీ సుబ్బరాయుడు ఆధ్వర్యంలో మండలంలోని శకునాల, ఓర్వకల్లు, మీదివేముల, నన్నూరు, హుసేనాపురం, లొద్దిపల్లె తదితర గ్రామాలలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ప్రతిఒక్కరూ పరిసరాల శుభ్రత పాటించాలని ఈ సందర్భంగా ఈఓఆర్డీ సూచించారు. కార్యక్రమంలో శకునాల జెడ్పీహెచ్ స్కూల్ హెచ్‌ఎం సునీత, ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది, ఆశా వర్కర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



కోడుమూరు: ర్యాలీని నిర్వహిస్తున్న అధికారులు



గూడూరు: ర్యాలీని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు



సి.బెళగల్: బస్టాండ్‌ను శుభ్రం చేస్తున్న ఈఓఆర్డీ సందీప్, సర్పంచ్ పాండురంగన్న

ఔషధాల దుష్పరిణామాలను తెలియజేయాలి

పాణ్యం: ఔషధాల దుష్పరిణామాల గురించి రోగులకు తెలియజేయాలని తిరుమల తిరుపతి దేవస్థాన ఫార్మసిస్టు డాక్టర్ గోపినాథ్ తెలిపారు. మంగళవారం స్థానిక శాంతిరాం ఫార్మసీ ఇంజినీరింగ్ కళాశాలో నాల్గవ జాతీయ ఫార్మకో విజిలెన్స్ వారోత్సవాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగుల భద్రత కోసం ఔషధ దుష్పరిణామాన్ని తెలియజేయాలన్నారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మధుసూధన్‌శెట్టి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఎస్సీ కమిషన్‌లో ఫిర్యాదు

కర్నూలు(అర్బన్): జిల్లాలోని పెద్దకడుబూరు మండలం కల్లుకుంట గ్రామంలో దళిత మహిళ గోవిందమ్మను వివస్త్రను చేసి అవమానించి దాడి చేసిన సంఘటనపై జాతీయ ఎస్సీ కమిషన్‌లో ఫిర్యాదు చేసినట్లు దళిత బహుజన ఫ్రంట్ జిల్లా అధ్యక్షురాలు వేల్పుల జ్యోతి తెలిపారు. డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్, మహిళా నేత పులి కల్పనతో కలిసి ఫిర్యాదు చేసినట్లు ఆమె మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జరిగిన సంఘటనకు సంబంధించి నివేదిక అందజేయాలని జిల్లా అధికార యంత్రాంగాన్ని కమిషన్ ఆదేశించిందన్నారు. గోవిందమ్మపై దాడి చేసిన నిందితులను తక్షణమే అరెస్ట్ చేసి బాధితులకు రక్షణ కల్పించాలన్నారు.

తమ్ముడిపై గొడ్డలితో దాడి

గడివేముల: మండల పరిధిలోని ఎల్‌కే తండాలో తమ్ముడిపై అన్న గొడ్డలితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ నాగార్జునరెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మాత్రునాయక్, కరంతోట్ బాలస్వామి నాయక్ అన్నదమ్ములు. భార్య లక్ష్మీబాయి, రామ కృష్ణనాయక్, కృష్ణానాయక్, కమలానాయక్, శ్రావణిబాయితో కలిసి అన్న మాత్రునాయక్ తన తమ్ముడు బాలస్వామినాయక్‌పై దాడికి పాల్పడ్డాడు. ఈ నేపథ్యంలో అడ్డు వచ్చిన తండ్రి నాగేనాయక్, తల్లి నాగిణీబాయిపై సైతం దాడి చేసి గాయపరిచారు. గాయపడిన వారిని బంధువులు నంద్యాల ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. బాధితుడు బాలస్వామినాయక్ ఫిర్యాదు మేరకు ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చెప్పారు.